అల్లూరి పోరాటాలను స్ఫూర్తిగా తీసుకోవాలి


జంగారెడ్డిగూడెం ఏఎస్ఆర్ పార్కులో అల్లూరికి నివాళులర్పిస్తున్న క్షత్రియ సేవా సమితి సభ్యులు


టి.నరసాపురం మండలం అల్లూరి సీతారామరాజు నగర్‌లో అల్లూరి వర్ధంతిని నిర్వహిస్తున్న దృశ్యం


కొయ్యలగూడెం శాఖ గ్రంథాలయంలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : భరత మాత బానిస సంకెళ్లు తెంచేందుకు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సందర్భంగా జంగారెడ్డిగూడెం ఏలూరు రోడ్డులో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద పీవైఎల్, పీడీఎస్‌యూ, ఇఫ్టూ సంఘాల ఆధ్వర్యంలో సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఈ.భూషణం, పీవైఎల్ జిల్లా నాయకులు తగరం బాబురావు, పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యవాదులను గడగడలాడించిన విప్లవ వీరకిషోరం సీతారామరాజు అని అన్నారు. దోపిడీ లేని సమాజం కోసం పోరాటం చేసిన యోధుడు అల్లూరి అని కొనియాడారు. నేడు ఆదివాసీలకు, దళితులకు, పీడిత వర్గాలకు ఎటువంటి హక్కులు లేకుండా కార్పొరేట్ సంస్థలకోసం ప్రభుత్వాలు పనిచేస్తుండడం దారుణమని విమర్శించారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను యువత ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు బన్నే వినోద్, పీవైఎల్ నాయకులు కట్టం నాగేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ నాయకులు తమ్మా సోమలింగ మల్లికార్జునరావు, ఉప్పాటి దాసు, గంపల శ్రీను, కె.అబ్బులు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మన్యం వీరునికి నివాళి

అప్‌ల్యాండ్ క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం అల్లూరి సీతారామరాజు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు జి.విజయరామరాజు, గౌరవాధ్యక్షుడు పి.జగపతి రాజు, ప్రధాన కార్యదర్శి ఎన్.రామచంద్రరాజు ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర పోరాటంలో మన్యం వీరుడు చేసిన వీరోచిత పోరాటాల గురించి గుర్తుచేసుకున్నారు. అనంతరం స్థానిక అల్లూరి సీతారామరాజు పార్కులో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం.సత్యనారాయణరాజు, జి.రాయపరాజు, డి.ధనరాజు, కేవీఎస్ఎస్ రామరాజు, ఎస్ఆర్ఆర్ ధర్మదేవ్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామరాజు ధన్యజీవి

మన్యంవీరునిగా పేరుగాంచి గిరిజనులలో చైతన్యం తీసుకువచ్చి స్వాతంత్య్ర సమరయోధునిగా ప్రతి ఒక్కరి మనసులో చిరస్మరణీయులుగా మిగిలిన అల్లూరి సీతారామరాజు ధన్యజీవి అని విశ్వహిందూ పరిషత్ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ అన్నారు. చిన్న వయసులోనే బ్రిటీష్ వారిని గడగడలాడించిన పోరాటయోధులు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. పరిషత్ సభ్యులు కొనకళ్ళ వెంకటేశ్వరరావు, బీకే విశ్వనాథ్ అల్లూరికి నివాళులు అర్పించారు.

గ్రంథాలయంలో...

కొయ్యలగూడెం : స్వాతంత్ర ఉద్యమ నాయకుడు అల్లూరి సీతారామరాజు 99 వ వర్ధంతిని స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయ పాలకురాలు యు.రాముడు ఆధ్వర్యంలో విద్యార్థులు, చదువరుల సంఘం సభ్యులు అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సీతారామరాజు ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు చూపిన ధైర్య సాహసాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

ఘనంగా అల్లూరి వర్ధంతి

టి.నరసాపురం : మన్యం వీరుడు అల్లూరి సీతామారాజు వర్ధంతిని టి.నరసాపురం మండలం అల్లూరి సీతారామరాజు నగర్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు నగర్ పోరాట కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఇళ్లస్థలాల పోరాట కమిటీ నాయకులు అనుమోలు మురళి, మడకం కుమారి, బరగడ కుమారి తదితరులు పాల్గొన్నారు.

పందిరిమామిడిగూడెంలో అల్లూరి వర్ధంతి


అల్లూరికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

బుట్టాయగూడెం : మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి కార్యక్రమం మండలంలోని పందిరిమామిడిగూడెం లంకపాకల గ్రామాల్లో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆ పార్టీ నాయకులు కారం రాఘవ, పీడీఎస్‌యూ నాయకులు భూషణం మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు గిరిజన ప్రాంతం నుంచి బ్రిటీష్ వారిపై చేసిన పోరాటాలను వివరించారు. గిరిజన చట్టాలను ప్రభుత్వాలు పటిష్టంగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెట్టి సుబ్బన్న, సర్పంచ్ కారం లక్ష్మి, ఎంపీటీసీలు కొవ్వాసి గోవిందరాజు, నాయకులు వినోద్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో సంక్షేమ పాలన

గిరిజన పంచాయతీకి రూ. 6 కోట్ల 37 లక్షల సంక్షేమ పథకాల లబ్ధి


కేఆర్ పురంలో నిర్మించిన సచివాలయ భవనం

బుట్టాయగూడెం : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి మన్యంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాల లబ్ధి అందుతోంది. టీడీపీ పాలనలో గ్రామ పంచాయతీకి ఏడాదికి కేవలం 135 పింఛన్లు, సుమారు రూ. 3 లక్షలు నిధులతో గ్రామాల్లో పనులు కేటాయించేవారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. మునుపెన్నడూ చూడని విధంగా అర్హులకు నేరుగా సంక్షేమ ఫలాలు అందించడంతో ప్రతిపక్షాల నాయకులు సైతం ఆశ్చర్యపోతున్నారు. బుట్టాయగూడెం మండలం కోటరామచంద్రాపురం గ్రామ సచివాలయం పరిధిలో 5 గిరిజన గ్రామాలు ఉన్నాయి. సుమారు 2000 మంది జనాభా ఉన్న పంచాయతీలో గత ప్రభుత్వం పాలనలో 135 మందికి ఫించన్ల ఇచ్చేవారు. సుమారు రూ. 3 లక్షలు అభివృద్ధి పనులు కేటాయించేవారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గడిచిన 4 ఏళ్లల్లో ఈ పంచాయతీలో రూ. 6 కోట్ల 37 లక్షలతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. సుమారు రూ. 42 లక్షల వ్యయంతో సచివాలయం, రూ. 25 లక్షలతో రైతుభరోసా భవనం, రూ. 42 లక్షలతో ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంకు ప్రహరీ నిర్మాణం పనులు జరిగాయి. వైఎస్సార్ ఆసరా పథకంలో 380 మందికి రూ.2 కోట్ల 37 లక్షల 9 వేల 280 సొమ్ము అందాయి. అమ్మ ఒడి ద్వారా 185 మందికి రూ.66 లక్షల 52 వేలు ఇచ్చారు. చేదోడు పథకంలో 7 గురుకి రూ.2 లక్షలు మంజూరు చేశారు. ఈబీసీ నేస్తంలో ఒకరికి రూ.45 వేలు ఇచ్చారు. వైఎస్సార్ బీమా పథకంలో ముగ్గురికి రూ.10 వేలు తక్షణ సహాయంతో పాటు రూ. 3 లక్షలు ఇచ్చారు. జగనన్న తోడు పథకంలో రూ.12 లక్షల 61 వేలు మంజూరు చేశారు. రైతు భరోసా ద్వారా 345 మందికి రూ. 2 కోట్ల 39 లక్షల 19 వేల 200 రూపాయలు లబ్ధిదారులకు అందించారు. వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా 518 మందికి రూ. 9 లక్షల 27 వేల 377 మంజూరు చేశారు. వైఎస్సార్ చేయూత ద్వారా 179 మందికి రూ. 58 లక్షల 31 వేల 250, గృహనిర్మాణం పనులు సంబంధించి రూ.1 కోటి 14 లక్షలు మంజూరు చేశారు.

ఇంతటి సంక్షేమాన్ని మునుపెన్నడూ చూడలేదు



నేను టీడీపీ ప్రభుత్వంలో కేఆర్‌పురం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పని చేశాను. మా అమ్మ కొవ్వాసి బుచ్చమ్మ కూడా సర్పంచ్‌గా పని చేశారు. ఆ రోజుల్లో ప్రస్తుతం జరిగినంత సంక్షేమం నేను చూడలేదు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ రూ. 2 లక్షల వరకూ బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు వేశారని ప్రజలు చెబుతున్నారు. ప్రజలు అలా చెప్పడం చాలా సంతోషంగా ఉంది.
– కొవ్వాసి నారాయణ, మాజీ సర్పంచ్, కేఆర్‌పురం, బుట్టాయగూడెం మండలం

నా అదృష్టంగా భావిస్తున్నాను



నేను ఒక వ్యవసాయ కూలీ కుటుంబానికి చెందిన వ్యక్తిని. వైఎస్సార్ సీపీ తరుపున సర్పంచ్‌గా పనిచేస్తుండడం నా అదృష్టంగా భావిస్తున్నాను. సంక్షేమ పథకాల ద్వారా ప్రజల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు పడుతుండడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నా పంచాయతీ పరిధిలో రూ. 6 కోట్ల 37 లక్షల వరకూ సంక్షేమం రూపంలో ప్రజలకు అందాయి.
– ఉయికే బొజ్జి, సర్పంచ్, కేఆర్‌పురం, బుట్టాయగూడెం మండలం

చికిత్స పొందుతూ మహిళ మృతి

జంగారెడ్డిగూడెం : చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెంలో నివసిస్తున్న పసుమర్తి శ్రావణి (35) మారుతి షోరూమ్‌లో పనిచేస్తుండేది. ఆమె భర్త చనిపోవడంతో తండ్రి వద్దనే ఉంటోంది. డబ్బులు పొదుపు చేసుకోకుండా ఖర్చు చేస్తోందని ఆమెను తండ్రి మందలించడంతో ఈనెల 4వ తేదీన గడ్డి మందు తాగింది. విషయం తెలుసుకున్న తండ్రి ఆమెను వెంటనే జంగారెడ్డిగూడెం ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. అక్కడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందింది. మృతురాలి సోదరుడు బొప్పన రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం : పేకాట స్థావరంపై దాడిచేసి ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. స్థానిక దళితవాడలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.900 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

నేటినుంచి విజ్ఞాన శిబిరం

ఏలూరు రూరల్ : ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 16 వరకూ వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చాటపర్రు గ్రంథాలయ నిర్వాహకురాలు కె.వాసుకి ఓ ప్రకటనలో తెలిపారు.స్థానిక గ్రంథాలయంలో ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ కొనసాగే శిబిరంలో నీతి కథలు వినడం, చదవడం, చిత్రలేఖనం, చదరంగం, స్పోకెన్ ఇంగ్లీష్‌తో పాటు సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదువుకుంటున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

జగన్‌తోనే అన్ని వర్గాలకూ సంక్షేమం


సంక్షమ లబ్ధి బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

- ఎమ్మెల్యే ఎలీజా
- గుంటుపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

కామవరపుకోట : అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. ఆదివారం మండలంలోని గుంటుపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా గ్రామంలోని ఇంటింటికీ తిరిగి గ్రామస్తులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ బ్రోచర్లు అందచేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల పనితీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అమ్మఒడి, చేయూత, వైఎస్సార్ రైతు భరోసా, వసతి దీవెన, విద్యా దీవెన పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని వివిధ వర్గాల ప్రజలను ఎమ్మెల్యే ఎలీజా అడిగి తెలుసుకున్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ కుల, మత రాజకీయాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించి ప్రజల మన్ననలు పొందుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకి అండగా ఉండి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ మిడతా రమేష్ బాబు, డా.రామకృష్ణ, పండు జగదీష్, మోరంపూడి సత్యన్నారాయణ, కొమ్మిన నరేష్, కృష్ణారావు, నాగళ్ళ సీతారాంబాబు, ఆశీర్వాదం, సేవా శ్రీను, రాయంకుల సత్యన్నారాయణ, నల్లూరి ప్రభాకర్‌రావు, తుమ్మల సీతారామయ్య, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

285 మందికి కంటి పరీక్షలు


కామవరపుకోటలో ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కామవరపుకోట : స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం చామర్తి కృష్ణారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాసవి క్లబ్, వనిత క్లబ్ పర్యవేక్షణలో రాజమండ్రి పరమహంస యోగానంద నేత్రాలయ వారిచే మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 285 మంది కంటి పరీక్షలు నిర్వహించి 141 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశారు. 15 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు చామర్తి కృష్ణారావు మాట్లాడుతూ కొన్నేళ్లుగా సంస్థ తరఫున అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, రానున్న రోజుల్లో పరిసర ప్రాంత మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. వాసవీక్లబ్ ప్రెసిడెంట్ జయవరపు ప్రసాద్, సెక్రటరీ సమయమంతుల పూర్ణచంద్రరావు, బచ్చు వెంకటేశ్వరరావు, కొండూరు రామకృష్ణ, కొనకళ్ళ అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు నగరంలో
రాత్రి గస్తీపై తనిఖీలు

ఏలూరు టౌన్ : ఏలూరులో అసాంఘిక శక్తుల భరతం పట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ఏలూరు నగరంలో పరిస్థితులను తెలుసుకునేందుకు జిల్లా పోలీస్ బాస్ స్వయంగా రంగంలోకి దిగారు. నగరమంతా తిరుగుతూ నైట్‌బీట్‌లను పరిశీలిస్తూ ఆయా ప్రాంతాల్లో పరిస్థితులను తెలుసుకుంటూ శాంతిభద్రతల పరిరక్షణకు చేపట్టాల్సిన ప్రణాళికలపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేశారు. ఏలూరు జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి శనివారం అర్ధరాత్రి ఏలూరులో రాత్రి గస్తీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రాత్రి గస్తీ ఏ విధంగా ఉందో స్వయంగా చూశారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఏఏ ప్రాంతాల్లో బీట్ పాయింట్లు పెంచాలి అనే విషయాలను తెలుసుకున్నారు. బీట్ సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆయా ప్రాంతాల్లో బీట్ బుక్కులను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ఏలూరు నగరంతోపాటు, జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో రాత్రి సమయంలో బీట్ నిర్వహించే సిబ్బంది ప్రతి ఒక్కరినీ నిశితంగా గమనించాలని చెప్పారు. ఉద్యోగ నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకుండా నిబద్ధతతో పనిచేయాలని, ప్రజలకు శాంతిభద్రతల పరిరక్షణలో నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. అనుమానిత వ్యక్తుల కదలికలను గమనిస్తూ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఏలూరు నగరంలో ప్రముఖ దేవాలయాలు, ప్రార్థనాలయాలు, బ్యాంకులు, ఏటీఎం సెంటర్ల వద్ద నిఘా బృందాలు సమర్థవంతంగా పని చేయాలన్నారు.

పేకాట, కోడిపందేల స్థావరాలపై దాడి

పెదవేగి : పేకాట, కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎం లక్ష్మణ్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం న్యాయంపల్లిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15,310 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. అనంతరం పినకడిమిలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 2,100 నగదు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

శ్రీవారి సేవలో ఉంగుటూరు ఎమ్మెల్యే


శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్యే వాసుబాబు

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఆదివారం ఉదయం సందర్శించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. అలాగే స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

బాధితుడికి ఆర్థిక సహాయం


బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న యువకులు

కొయ్యలగూడెం : తారక రామనగర్‌కు చెందిన నంగనం లవరాజు అనే వ్యక్తికి కొయ్యలగూడేనికి చెందిన యువకులు ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ లవరాజు కుటుంబ పోషణ గడవక ఇబ్బందులు ఎదుర్కొంటున్న దీనావస్థను చూసి యువకులు స్పందించారు. కొయ్యలగూడెం మిత్ర బృందం సభ్యులు రూ.9,400 బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మేడిన కన్నయ్య, నక్క బాబీ, చెప్పుల మధు, మందపాటి రామకృష్ణ, మాదేపల్లి శ్రీను, సంకు మధు, చవ్వా రాము, కూచిమంచి శ్రీను, కాలేపల్లి అనుదీప్, నక్క రాము, కొనే శివ, వార్డ్ మెంబర్ వూసల రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ


స్వామివారిని దర్శించుకున్న జెడ్పీటీసీ బాబ్జిని సత్కరించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : లక్కవరం అరుంధతి పేటలో నిర్మించిన రామాలయంలో ఆదివారం సీతాముల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవారి విగ్రహాలు ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో సీతారాములను దర్శించుకున్నారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన్ను ఆలయ మర్యాదలతో సత్కరించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. సర్పంచ్ గెల్లా వెంకటరమణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


దాత బీవీఎస్ రెడ్డిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు, గ్రామస్తులు

లింగపాలెం : లింగపాలెం మండలం కొణిజర్ల గ్రామంలో అంకమ్మ తల్లి నూతన ఆలయ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ నేత భీమిరెడ్డి వెంకటసూరారెడ్డి (బీవీఎస్ రెడ్డి) ఆదివారం రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఈ మేరకు బీవీఎస్ రెడ్డిని ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వలసపల్లి రాముడు, వలసపల్లి శ్రీను, వేంపాటి రాంబాబు, వి.పుల్లయ్య, వి.సత్యన్నారాయణ, మండల వైఎస్సార్ సీపీ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు రావి కొండయ్య, రెడ్డి నాగేశ్వరరావు, రెడ్డి బాబ్జి, తదితరులు ఉన్నారు.

10న చిత్రకారులకు జీవిత సాఫల్య పురస్కారాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఏలూరు ఆర్ట్ సొసైటీ 7వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 10వ తేదీన 3వ చిత్రకళా ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎంహెచ్ఏ హాలులో జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ సీనియర్ స్టూడెంట్స్‌కి స్పాట్ పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 3గంటల నుంచి కూచిపూడి నృత్య ప్రదర్శన, అనంతరం సంగీత కచేరి ఉంటుందన్నారు. మద్రాసుకు చెందిన సినీ పబ్లిసిటీ ఆర్టిస్ట్ కడలి సురేష్, విశ్రాంత చిత్రకళ ఉపాధ్యాయుడు ఉండ్రు ఆశీర్వాదం, అంబికా ఆర్ట్స్ అధినేత మజ్జి సూర్య కాంతారావుకు, కమర్షియల్ ఆర్టిస్టులు మందరపు పోతులూరి ఆచారి, ముక్తాల రామకృష్ణ, సినీ పబ్లిసిటీ బ్యానర్ ఆర్టిస్ట్ బోగాది రాంబాబులకు జీవిత సాఫల్య పురస్కారాలు అందిస్తామన్నారు.

ఆర్‌బీకేల ద్వారా పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ


గంగవరం ఆర్‌బీకే సెంటర్ వద్ద విత్తనాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : రాజవరం పంచాయతీ గంగవరం రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ గ్రామ కన్వీనర్, రైతు నాయకులు కంచర్ల సత్యనారాయణ, ఎంపీటీసీ కొండేపాటి చింతయ్య కార్యక్రమానికి హాజరై సిబ్బందితో కలిసి రైతులకు విత్తనాలను సరఫరా చేశారు. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు ప్రభుత్వం ద్వారా అందించాల్సిన సహాయ సహకారాలు సకాలంలో అందుతున్నాయన్నారు. 50 మందికి సరిపడా విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని సిబ్బంది తెలిపారు. గ్రామ వ్యవసాయ సలహామండలి సభ్యుల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలు జనుము, జీలుగ, పిల్లిపెసర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే గ్రామ సచివాలయ సెక్రెటరీ కె.అచ్యుత్ కుమార్, ఈడుపుగంటి తాతారావు, వ్యవసాయ సహాయకులు జి.బాలార్జున్, గ్రామ రైతులు, వార్డు సభ్యులు, నాయకులు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న బొరగం వెంకటలక్ష్మి

పోలవరం రూరల్ : తపన ఫౌండేషన్ అధినేత గారపాటి చౌదరి గారి ఆర్థిక సహాయంతో గూటాల గ్రామంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొరగం వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, యువకులు చదువు, క్రీడలు, దేశంపై ఎక్కువ మక్కువ చూపాలన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 30 గ్రామాల నుంచి క్రికెట్ టీమ్‌లు పాల్గొనడం చాలా సంతోషం అన్నారు. తపనా చౌదరి జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమని అన్నారు.

ఒకే చెట్టుకు రెండు వర్ణాల పుష్పాలు


ఒకే జాతి మందార చెట్టుకు రెండు వర్ణాల మందార పుష్పాలు పూసి చూపరులను ఆకట్టుకుంటున్నాయి. కొయ్యలగూడెం దళితవాడకు చెందిన కార్పెంటర్ ఏలేటి భాస్కరరావు పెరట్లోని మందార మొక్కకు ముద్ద ,రేఖ మందారం జాతికి చెందిన రెండు రంగుల పుష్పాలు ఒకేరోజు పూశాయి. ముద్దమందారం జాతికి చెందిన మందార మొక్కకు విభిన్నంగా రెండు పూలు పూశాయని భాస్కర్ తెలిపారు.
– కొయ్యలగూడెం